# భగవంతుడి జాబితా

నేనొక పూర్ హైస్కూల్ టీచర్ని. నాతోడి టీచర్లు, హెడ్మాస్టరుగారితో సహా నాకంటే పూర్. మాబడి విద్యార్థులైతే ఇంకా ఇంకా పూర్. ఎడారి లాంటి బడి జీవితంలో మాకొకటే ఒయాసిస్సు. ఆ ఒయాసిస్సును గురించే నేను చెప్పదలచుకున్నది.

అయితే ఎడారిలో పయనించిన తరువాత గదా ఒయాసిస్సు. అందువల్ల ముందుగా ఎడారిని గురించి.

బాణావరంనుంచి నెల్లిపట్ల వెళ్ళే రోడ్డులో చోరగుడి కనుమ దాటిన తరువాత రోడ్డు కిరువైపులా విస్తరించిన ఊరొకటి కనిపిస్తుంది.

అదే మా ఊరు. చెల్లనూరు. చెల్లని ఊరు కనుక చెల్లనూరుగా మారిందట. మానాన్నగారు చెబుతుండేవారు. వేరే ఊళ్ళ వాళ్ళు మా ఊళ్ళో చెల్లరనీ, మా ఊరి వాళ్ళుకూడా అట్లాగే వేరే ఊళ్ళలో చెల్లరని తాత్పర్యం! అందువల్ల మా ఊరికి యాభై ఏడో దేశమన్న కితాబు.

సాధారణంగా ప్రభుత్వ హస్తాలు మా ఊరిదాకా సాగిరావు. మా ఊరికిన్నీ ప్రభుత్వమంటూ ఒకటుందన్న స్పృహ ఉండేది కాదు. అయితే ఈ స్వతంత్ర ప్రతిపత్తిని చెరపివేయడానికన్నట్టుగా పదేళ్లనాటి ఎలక్షన్లలో ఒక తిరకాసొచ్చి పడింది. ఎన్నికల్లో పోటీకి నిలబడిన అభ్యర్థి మా వోట్లన్నీ తనకు పడితే మా ఊరికొక హైస్కూలు తెచ్చిపెడతానన్నాడు. ఎలక్షన్ వాగ్దానాలకు కూడా పాటింపు ఉంటుందని ఎవరనుకుంటారు? అనుకోనిదే జరిగిపోయింది. అయితే మంజూరైన హైస్కూలు తెచ్చిపెడతానన్నాడు. ఎలక్షన్ వాగ్దానాలకు కూడా పాటింపు ఉంటుందని ఎవరనుకుంటారు. అనుకోనిదే జరిగిపోయిది. అయితే మంజూరైన హైస్కూలు కోసం గ్రామం తరపున చెల్లించుకోవలసిన పదివేల రూపాయల విరాళాన్ని పోగుచేసేటప్పటికే మా ఊరి వాళ్ళు 'ఓరి నాయనా! ఏం పీడ వచ్చి పడిందిరా బాబూ' అని నోరు విడిచేశారు. అప్పటినుంచీ శుభ్రంగా సహాయ నిరాకరణ మొదలెట్టారు. 'హైస్కూలెక్కడ పెట్టమంటారు?' 'ఏం, గ్రామ పోరంబోకులు లేవా!' 'కట్టడాల మాటేమిటి?' "ఆకాశమే పైకప్పు. క్రింద పెట్టుకోండి.' – 'అబ్బే లాభం లేదు. హైస్కూలు తీసేస్తాం' – 'మంచిది. అలాగే చెయ్యండి'!

మొండివాడు మహారాజుకంటే బలవంతుడంటారు. మా ఊరి మొండితనం దెబ్బకు జిల్లా పరిషత్తే ఖంగుదిని పోయింది. అయితే, వాళ్ళు మాత్రం తక్కువ తిన్నారా? టీచర్లతో బాటు ఒక హెడ్మాస్టరునుకూడా కేటాయించి మా ఊరిపైకి తోలేశారు. ఊరి తరపున కనీసం ఒక్కరైనా వాళ్ళకు పలుకుతోడుగా ఉంటే బాగుంటుందని నన్ను స్థానిక ఎలిమెంటరీ స్కూలునుంచీ గోడ, నీడ, కుర్చీ, బెంచీ ఏదీ లేని హైస్కూలుకు బదలాయించారు. ఊరి చివర రోడ్డుకు పశ్చిమంగా హైస్కూలు కని నిర్దేశించిన పోరంబోకు జాగాలో నిల్చుని మే మయిదారుగురు టీచర్లమూ దిక్కులు చూశాము.

ఖిన్నుడైపోయిన హెడ్మాస్టరుగారు దీన ప్రలాపాలు మొదలుపెట్టారు. "ఏనాడు చేసుకున్న పాపమో, ఈనాటికి మన స్థితి ఇలా అఘోరించిందండీ రామ్మూర్తిగారూ! మనమెక్కడ కూచుంటాం? పిల్లల్ని ఎక్కడ కూచోపెడతాం? పాఠాలెలా చెబుతాం? ఇంతకంటే ఘోరకలి ఎక్కడైనా ఉంటుందా? అడ్మిషన్లు ప్రారంభమై, బిల్డింగు ఫీజు ఏదైనా వసూలైతే పూరికొట్టమైనా వేయించుకోవచ్చు. అందాకా ఏం చేద్దాం చెప్పండి!"

'నేను అదే ఆలోచిస్తున్నా' నన్నాను.

కానీ హెడ్మాస్టరుగారి కెలాగైనా పని జరగాలని ఉంది. ఆయన రోడ్డు కానుకున్నట్టు తూర్పువైపుగా ఉన్న పచ్చని పట్టు చూపిస్తూ - "అదేమిటో ఆశ్రమంలా ఉంది గదండీ! రెండో మూడో పెద్ద చెట్లున్నట్టున్నాయి. నీడలో పిల్లలు కూచోవచ్చు. అయితే తోటగల ఆసామి ఒప్పుకోవాలి. ఆయనకు మీరు చెప్పగలరా?" అన్నాడు.

నేను సందిగ్ధంలో పడ్డాను. అది తోట కాదు. ఆశ్రమమున్నూ కాదు. ఏడేనిమిదేళ్ళకు మునుపు అది వట్టి బీడుగానే పడి ఉండేది. ఒక ఒంటరి ముసలాతడు చరమ జీవన సంధ్యలో తానుండడంకోసం ఒక కుటీరం వేసుకున్నాడు. ప్రహరీగా ఉంటుందని చుట్టూరా గ్రామఫోను పూలమొక్కలు నాటాడు. నీడగా ఉండడంకోసం నాలుగైదు గ్లైరిసీడియా చెట్లు పెంచుకున్నాడు. సంఘబాహ్యుడు కాదు గానీ, అతడు సంఘంతో పెద్దగా సంబంధాలు లేనివాడు. జీవితంలో ఎన్నో ధక్కా మొక్కీలు తిన్నవాడు. మనుషుల సౌజన్యం పట్ల విశ్వాసం పెంచుకోవలసినవాడు కాదు. త్రుంచుకోవలసిన వాడు. అతడు మా ప్రతిపాదనకు ఒప్పుకుంటాడా అన్నదే నా సందేహం.

అయినా అడిగి రావడానికే ఉద్యుక్తుడినయ్యాను.

అతణ్ణి అందరూ 'నెటాలం సాయిబు' అంటారు. అది అసలు పేరు కాదు. సముద్రాలు దాటివెళ్ళి అతడు దక్షిణాఫ్రికాలోని నెటాల్ బంగారు గనుల్లో నాలుగైదేళ్ళ పాటు పనిచేసి తిరిగివచ్చాడట! అప్పటినుంచీ అదే పేరు. నెటాలం సాయబు జనన కాలాన్ని ఆరాతీయడానికి అతడూ, నేనుకూడా రకరకాలుగా ప్రయత్నించాము. 'మీ నాయన పుట్టేటప్పటికి నా బుద్ధి నాకొచ్చేసినాది. బళ్లో మీ తాత దగ్గిర చదువుకుంటూ ఉండా' లన్నాడు. 'నేను బళ్ళో ఉండగానే యుద్ధం ఆఖరైపోయిందని చెప్పుకుండ్రి' అని ఇంకొక మాటకూడా అన్నాడు. మొదటి ప్రపంచ యుద్ధంతో లంకెగట్టి, ఈ రెండు 'క్లూ' లూ ఆధారంగా నేనతడి పుట్టిన తేదీని ఈ శతాబ్ది ప్రారంభ సంవత్సరాలలోకి నెట్టగలిగాను.

మా ఇంట్లో ఒక మూలగా కాగు పక్కన పాతకాలంనాటి బూట్ల జత ఒక టుండేది. పాదాన్ని బూట్‌లో పెడితే, దాంతో కలిపి తయారుచేసిన తొడుగు మోకాళ్ళ కిందికి వచ్చేస్తుంది. నాడాతో దాన్ని బిగించుకోవాలి. ఆ బూట్లెక్కడివని అడిగితే తెలిసింది. విదేశంనుంచీ తిరిగి వస్తూ నెటాలం సాయిబు గురువుగారి కుమారునికి - అంటే మా నాన్నగారికి ఆ బూట్లు తీసుకొచ్చి బహూకరించాడట! ఇంకా కోట్లు, రుమాళ్ళు, చేతికర్రలు, టోపీలు మొదలైనవి ఒక మూటనిండా తీసుకొచ్చి ఎవరి కవసరమైనవి వాళ్ళకిచ్చినట్టు చెప్పుకునేవారు. లక్షలున్నవాడు దానాలు చేస్తే అతణ్ణి చేతికెముక లేనివాడని

చెప్పుకుంటారు. నెటాలం సాయబు చేతికాప్రశస్తి రాలేదు. అతడు పెద్దమనిషిగా మాత్రమే పేరుపడ్డాడు.

బంగారు గనుల్లో పనిచేశాడు కనుక అతడెంత లేదన్నా ఒక వెలగకాయంత బంగారంతో స్వదేశానికి తిరిగి వచ్చి ఉంటాడని మా ఊళ్లో ఒక పుకారుండేది. అడిగిన వాళ్ళకు ఆపదల్లో ఉన్న వాళ్ళకు లేదనకుండా తృణమో, ఫణమో ఇస్తూ రావడంపై పుకారు బలపడడానికి తోడ్పడింది. అవసరమైనప్పుడల్లా అతడు బంగారాన్ని డబ్బుగా మార్చేసుకుంటున్నాడని అనుకోవడం ఆనవాయితీ అయిపోయింది. అందుకు తగ్గట్టు ఉందో లేదో తెలియనివ్వకుండా అతడు తన పిడికిలిని బిగించే ఉంచాడు. ఉన్నా లేనట్టుగా, లేకపోయినా ఉన్నట్టు గుంభనగా బ్రతకడం అతడి ధ్యేయమై ఉండొచ్చు. కానీ, అందువల్ల అతడు భాగ్యవంతుడైనదీ, కానిదీ కూడా ఒక మిస్టరీగానే ఉండిపోయింది.

మూలధనం సంగతేమిటో నాకు తెలియదు గానీ, నడమంతరపు సిరిలాంటిదేదైనా దాపురిస్తే, ఉండే ఇంట్లో, కట్టే బట్టల్లో, తినే తిండిలో మార్పు కనిపించాలి. నెటాలం సాయిబు జీవితంలో అలాంటి హఠాత్పరిణామమేదీ పొడసూపలేదు. నాకు తెలిసినంతవరకు అతడు తన చేతుల బలవంతంతోనే సంసార రథాన్ని లాగుతూ వచ్చాడు. పదిపన్నెండేళ్ళ ఈడప్పుడు ఎండాకాలపు మధ్యాహ్నాల్లో నేను ఈత నేర్చుకోవడంకోసం మెరకవీధి గుండా చెరువు క్రింద బావుల దగ్గరికి వెళ్ళేవాణ్ణి. మెరకవీధిలో నెటాలం సాయిబుకు పిత్రార్జితంగా సంక్రమించిన చుట్టిల్లు కోడిపిల్లల పైన పెట్టిన కుక్కి తట్టలా కనిపించేది. మొదటి భార్య కొద్ది సంవత్సరాలు కాపురం చేసి భర్త పాలిటికి ఇద్దరు బిడ్డల్ని మిగిల్చి కాలం చేసింది. ఆ బిడ్డల్ని అత్తవారింట్లో అప్పగించి అతడు నెటాలం వెళ్ళాడు. తిరిగి వచ్చాక బిడ్డలతోబాటు అత్తగారింట్లో ఉండడానికి మనస్కరించక గంజి కాచి పొయ్యడంకోసం రెండో పెళ్ళి చేసుకున్నాడు. తండ్రి నిబ్బరాన్ని పరీక్షించడానికన్నట్టుగా రెండో భార్యకు అయిదుగురు బిడ్డలు కలిగారు. పూటకొక శేరు బియ్యం ఉడకేస్తే చట్నీకి మెతుకులేకుండా మాయం చేసేంతటి జనం. అన్నముంటే సరిపోయిందా? కూర చారు లుండొద్దూ! తిండి సంగతి సరే, బట్ట మాట? ఈ ఖర్చులన్నీ నిభాయించుకోడానికి అతడెన్ని పాట్లు పడిఉంటాడో ఊహించుకోవలసిందే! బాట పక్కన ఏభై సెంట్ల పొలమైతే ఉంది గానీ, దానికి నీటి వసతి లేదు.

ఎద్దులబండి ఒకటే అతడి జీవనసాధనం. బాడుగలకు బండి తోలేవాడు. వడ్లు, బెల్లం, వేరుశనగ, చింతపండు – ఇలా ఏ సీజన్లో ఆ సరుకు. తెల్లవారుజామున్నే బండి కట్టి ఇటు బాణావరానికో, అటు నెల్లిపట్లకో వెళ్తే ఇక రాత్రి తొలి జాము గడచిన తరువాతనే తిరిగి రావడం. తిరుగు ప్రయాణంలో బట్టల బేళ్ళో, సిమెంటు బస్తాలో, మళిగ సామాన్లో వేసుకొచ్చేవాడు. ఊళ్ళో సరుకు లెత్తడం, బస్తీలో దించడం – ఇదంతా అతడి డ్యూటీలో భాగమే. ఈ నిర్విరామ వ్యాసంగంవల్ల అతడు పగటివేళల్లో ఊళ్లో కనిపించడమే గగనం. అతడి బిడ్డల్లో కొందరు వారాల తరబడి అతడి ముఖాన్ని చూడగలిగేవారు కారేమోనని నా అనుమానం. 'సాగితే బండి, సాగకపోతే బండ' అని సామెత. నెటాలం సాయబు

బండి సాగినందువల్లనే అతడి సంసారమున్నూ సాగింది. ఒకరిని యాచించకుండా, ఒళ్ళు దాచుకోకుండా తన పనేదో తాను చేసుకపోయేవాడిని కర్మయోగిగా భావించి ఉండొచ్చు. కానీ నెటాలం సాయిబు యాతనంతా, మా ఊరి వాళ్ళకు అంతులేని వెంపర్లాటగానే తోస్తూ వచ్చింది.

నెటాలం సాయిబు ప్రయోజకత్వాన్ని మరింతగా పరీక్షకు పెట్టింది పెళ్ళిళ్ళ ఘట్టం. ఈ సుడిగుండంలో ఊపిరాడక చేతులెత్తేసి, అతడు బుడుంగున మునిగి పోవచ్చుననే సంశయాత్ములు భావించారు. అయితే సాయిబు వాళ్ళ ఊహను వమ్ము చేశాడు. ఎంతో కొంత నగలు పెట్టి, కొద్దో గొప్పో కట్నకానుకలు ముట్టజెప్పి, యేటలు కోసి అండాల్లో పలావులు కుర్మాలు వండించి, అతడు వీలయినంత దర్జాగానే ముగ్గురు కూతుళ్ళకూ పెళ్ళిళ్ళు చేశాడు. అంతస్తులో తనకంటే ఒక నూలువాసి ఎక్కువైన కుటుంబాలలోకే వాళ్ళను పంపించాడు.

కొడుకుల విషయంలో మాత్రం ఎదుటివారి పెట్టుపోతల కోసం ఆశించకుండా, గుణానికే ప్రాధాన్యం ఇచ్చి పేద కుటుంబాల నుంచే కోడళ్ళను తెచ్చుకున్నాడు. సమిష్టి కుటుంబమనే సర్కస్సుతో సతమతమయ్యే ఓపికలేక పెళ్లికాగానే ప్రతి కొడుక్కూ ప్రత్యేకంగా ఒక ఆశ్రయం కట్టించి ఇచ్చి, బ్రతుకుతెరువు కేదో దారి చూపించి, దానికి కావలసినంతగా డబ్బుకూడా సర్దుబాటు చేస్తూ వచ్చాడు.

ఈ వివాహ తతంగాలన్నీ ముగిసేటప్పటికి అతడికి అరవై ఏళ్ళొచ్చేశాయి. వయసులో ప్రొద్దుపడమటకి వాలిపోయింది. అరవైకి డెబ్భైకి మధ్య మళ్ళీ కోలుకోకుండా చేస్తూ అతడికి రెండు ఎదురు దెబ్బలు తగిలాయి. మొదటిది, తోడునీడగా వెన్నుదన్నుగా ఉంటూ వచ్చిన భార్య కళ్ళు మూసింది. రెండోది, ఒక సందె చీకటివేళ బాణావరంనుంచీ తిరిగొస్తూ ఉండగా వెనుక నుంచీ వచ్చిన లారీ ఒకటి ఎద్దులబండిని గుద్దేసింది. సాయిబు నొగపైన్నుంచీ ఎగిరి క్రిందపడ్డాడు. బెదరిన గొడ్లు పరుగుదీయగా బండిచక్రం అతడి మోచేతికి పైగా వెళ్ళిపోయింది.

పుత్తూరు శల్యవైద్యంలో అంగవైకల్యం తప్పినా, కుడి చేతికి పగ్గాలు బిగపట్టే సత్తువ లేకపోయింది. 'అయినా సాయిబు కేమి లేవయ్యా, వీరుళ్ళు, శూరుళ్ళు మాదిరిగా నలుగురు కొడుకులుండారు. వాళ్ళే ముసలి కట్టెను కడతేర్చకపోతారా!' అనుకున్నారు మా ఊరి వాళ్ళు.

సాయిబు కొడుకులు ఆ ప్రశంసకు తగి ఉన్న మాట నిజమే! పెద్ద కొడుకు రహీం చిల్లర కొట్టు ఆసామి. దాన్ని జనరల్ స్టోర్స్ స్థాయికి తెచ్చేశాడు. రెండోవాడు కరీం తోళ్ళ వ్యాపారంనుంచీ చెప్పుల షాపు పెట్టేదాకా వచ్చేశాడు. మూడోవాడు మస్తాను సైకిళ్ళ ఓనరు. పది పన్నెండు సైకిళ్ళపైన కిరాయి సంపాదిస్తున్నాడు. చిన్న కొడుకు సులేమాన్ పాతిక కోళ్ళతో ప్రారంభించిన ఫారంను వృద్ధిచేసి, ప్రతిరోజూ రెండు అట్టపెట్టెల నిండుకూ కోడిగుడ్లు టౌనుకు రవాణా చేస్తున్నాడు.

పనిమంతులే కాదు, వాళ్లు బుద్ధిమంతులనే విషయంలో కూడా ఊళ్ళో బేదాభిప్రాయాలు లేవు. అశక్తుడైన తండ్రిపట్ల నిరాదరణ జూపడమన్న దురుద్దేశాన్ని

వాళ్ళ కంటగట్టడానికి వీల్లేదు. కానీ బాధ్యత నలుగురిదీ కనుక, ఆ మేరకు వంతుల వారీగా దాన్ని పంచుకోవాలని అనుకున్నారు. ఈ వంతుల వారీ పద్ధతి ఎలా ఉండాలన్న విషయంలో ఒక అవగాహనకు రావడంలో మాత్రం ఆలస్యమైంది. రోజుకొకరింట్లో భోంచేయడమా? వారానికొకరింట్లో చొప్పున గడపడమా? లేకుంటే నెలల వారీ ఏర్పాటా? ఎటూ తోచక వాళ్ళు నిర్ణయాన్ని తండ్రికే వదిలేశారు.

అయితే ఆ కొడుకు లిక్కడ గమనించదగిన అంశం ఒకటుండిపోయింది. అభిమానమే ఆత్మధనంగా బ్రతికినవాడు ఒక స్థాయి నుంచీ క్రిందికి దిగజారలేదు. 'అక్కడా ఇక్కడా ఎందుకు? నువ్వు నా దగ్గరే ఉండిపో నాన్నా!' అని ఏ కొడుకైనా అంటాడేమోనని నెటాలం సాయిబు ఆశించాడు. అప్పటికి ఆయనొక బరువైనట్టు, వాళ్ళు దీన్ని వంతులవారీగా మోయదలచుకోడం అతడి ఆత్మాభిమానంపైన దెబ్బతీసింది. 'మంచిదిరా అబ్బాయిలూ! అంతగా అవసరమైతే అప్పుడాలోచించుకుందాం!' లెమ్మన్నట్టుగా ఊరుకున్నాడు, కానీ ఊరుకున్నాడంటే ప్రత్యామ్నాయం ఆలోచించకుండా కాదు.

"ఏమయ్యా చిన్న అయ్యవారూ! పిల్లకాయల్ని చెట్లకింద కూచోబెట్టుకొని చదువు చెప్పుకుంటారా? నువ్వామాట అడిగేందుకొస్తావా? మంచోడివే! నేల అరిగిపోదూ! నీడను కొంచెం కొంచెంగా పీకి తినేయ్యరూ! చాల్చాలు పోయ్యా! పొయ్యి తోలుక రండయ్యా పిల్లగాళ్ళని" అన్నాడు నెటాలం సాయిబు.

వెళ్ళిన పని సుకరంగా ముగిసినందువల్ల నేనే కొంచెం బెట్టు చేశాను. "చూడు సాయిబూ! మళ్ళీ చెప్పలేదనుకోక! నాలుగు రోజులుండనిచ్చి, అయిదో రోజు వెళ్ళిపొమ్మంటే బాగుండదు..."

సాయిబు ముఖం సీరియస్‌గా మారింది. "అయితే నువ్వనే దెట్టా?" అంటూ ఉరిమాడు.

నేను మాట్లాడుతున్నది రెండు నాల్కల మనిషితో కాదని చప్పున గ్రహించాను. "లేదులే బాబూ! నువ్వా మాట అనవు. నాకు తెలుసు" అని తప్పించుకున్నాను.

ఆ విధంగా మా హైస్కూలు ఆశ్రమ గురుకులంలా ప్రారంభమైంది. ఉదయం తొమ్మిదింటికల్లా పిల్లలు బిలబిలమంటూ పావురాయి పిట్టల్లా, పిచ్చుక గువ్వల్లా, తూనీగల్లా వచ్చేసేవారు.

బడికి స్వీపరు లేకపోయినా అప్పటికి పరిసరాలన్నీ అద్దంలా శుభ్రంగా ఉండేవి. చేదబావి దగ్గర చేతులు కడుక్కోడానికి తొట్టిలోను, తాగడానికి బానల్లోను నీళ్ళుండేవి. తగిలించడానికి వీలున్న అన్నం కారియర్లను చెట్ల కొమ్మలకు తగిలించి, మిగిలిన వాటిని చెట్లకు చుట్టు కైవారంగా కట్టిన అరుగులమీద పెట్టి, వచ్చిన పిల్లలందరూ సాయిబు చుట్టూ మూగిపోయేవారు. అతడు చెప్పే కబుర్లు వాళ్ళకు మా పాఠాలకన్నా ఆసక్తికరంగా ఉండేవి. అంభోదర గిద్దడనే ఘరానా దొంగ కథ, వేటకు వెళ్ళి తిరిగిరాని గుర్రంకొండ నవాబు కథ, ఇసుకను బంగారంగా మార్చేస్తానన్న కుంటిబైరాగి కథ, ఏనుగుల మల్లమ్మ కొండకు ఆ పేరు రావడానికి కారణమైన కథ – ఇలా ఎన్నో కథలూ, గాథలూ!

కథలు చెప్పడంలో ప్రతిఫలాపేక్షలేకపోయినా, నెటాలం సాయిబు నిష్కామకర్మకు ఆయాచితంగానైనా ఫలితం దక్కకపోలేదు. మధ్యాహ్న భోజన సమయాల్లో అతడి పని జల్సాగా ఉండేది. 'ఈరోజు మా అమ్మ పులిహోరారా చేసి పెట్టింది. ఈ పట్టెడు నోట్లో వేసుకో సాయిబూ!' అని ఒకరు, 'పండుగకు అతిరసాలు చేసినాం. నీ భాగం నీకు!' అని ఒకరు, 'మా తోటలో కాసిన జామందు కలకండ మాదిరుంటుంది. తిని చూడు' అని ఒకరు – ఇలా దొరికిన ఉపాయనాలతోనే అతడి కడుపు నిండిపోతుండేది.

ఉదయం మొదటి గంట కొట్టగానే అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ క్రమపద్ధతిలో నిలబడి ప్రార్థన చేస్తున్నప్పుడు నెటాలం సాయిబు కళ్ళలో అపురూపమైన ఆనందమేదో తొణికిసలాడుతూ ఉండేది. క్లాసులు ప్రారంభమైన తరువాత చెట్ల చాటున, మాటున అతడు నీడలా సంచరిస్తూ ఏ పాఠ్య భాగమైనా తనకర్థమయ్యేటట్టుగా తోస్తే శ్రద్ధగా ఆలకించేవాడు. అందును గురించి ఏవైనా సందేహాలేర్పడితే, ఆయా టీచర్లనెప్పుడైనా అడిగి తెలుసుకునేవాడు.

'ఆకాశంలో చుక్కలు భూమికంటే పెద్దవని అంటిరి కదా! అట్టయితే అవి పడిపోకుండా అంతర్మద్దెంలోనే ఎట్లా ఉండాయి? సముద్దరంలో నీళ్ళుప్పగా ఉండేదెందుకు? కొన్ని నెలల్లో దినాలెక్కువగాను, కొన్నిటిలో తక్కువగానూ ఎందుకుండాయి?' ఇలా ఎన్నో ధర్మసందేహాలు.

లీజర్ పీరియడ్‌లో దూరంగా ఒక నీడపట్టున కూర్చున్నప్పుడు నేను ప్రత్యేకంగా సాయిబు కోసం క్లాసు తీసుకోవలసి వచ్చేది. నా పాలిటికది చాలా గడ్డుక్లాసు.

'మనుషులనే వాళ్ళు పుట్టకముందు ఎక్కడుంటారు? చచ్చిన మీదట ఎక్కడి కెల్తారు? భూమిపయిన మనిషిగా పుట్టినందుకు మంచి దోవ ఎదుక్కోవాలిరా సాయిబూ!' అని మీ తాత చెప్తా ఉండె. మంచి దోవంటే ఏంది? దినానికి అయిదుసార్లు నమాజు చెయ్యాలంటారు. మా సాయిబులు. నా వేసట బతుకులో నేను దినానికొకసారైనా చెయ్యలేకపోతి. ఇప్పుడు చెయ్యాలంటే నడు మొంగేది కష్టమైపోయ. నామీద దేముడికి కోపమొచ్చుంటదంటావా?' – ఇలా నెటాలం సాయిబు ప్రశ్నలన్నీ నా పరిజ్ఞానానికి అతీతమైనవే! కానీ సాయిబు దృష్టిలో నేను గొప్ప చదువరి క్రింద లెక్క. నాకు తెలియదంటే అతడు సుతరామూ ఒప్పుకోడు. అందుకని అప్పటికప్పుడు తోచిన సమాధానాలేవో చెప్పి అతణ్ణి తృప్తిపరిచేవాణ్ణి.

ఒకసారి తమాషా ప్రశ్న ఒకటి నాపైకి సంధించాడు సాయిబు.

"అయ్యా, చిన్న అయ్యవారూ!" నిన్నొక మాట అడగాల. నేను నెటాలంలో ఉండగా అక్కడొక పాదిరి దొర ఉండె. మన నల్లోడేలే. కేరలా వోడని చెప్పుకుండ్రి. తెలుగోళ్ళతో తెలుగు, అరవమోల్లతో అరవం, ఇంగిలీసోళ్ళతో ఇంగిలీసు, మహాన్నభావుడు, ఆయనకు రాని మాట లేదు. ఒక దినం మేం పదిమంది తెలుగోల్లం పోయి ఆయన దగ్గర కూచుంటిమి. అప్పుడాయన ఏమనినాడంటే–

'భగమంతుడేం జేస్తా ఉంటాడో తెలుసునా?' అనే – తెలియదంటిమి. 'బాగా కన్నులెర్రచుకోని లోకం తట్టు చూస్తా ఉంటాడు. కొంపలుకూల్చే దేవుడో, కాపురాలు

నిలబెట్టే వాడెవరో, బాటలేసే వాడెవడో, బాటలో గుంతలు తవ్వే వాడెవడో, తన కడుపే కైలాసమనుకునే వాడెవుడో, తాను తిని మిగిలిందెవురికైనా చెయ్యి సాచే వాడెవుడో - ఇదంతా బాగా కణిసించి విలావరిగా లెక్కేసుకుంటాడు. ఇంత జేసినాక ఏం చేస్తాడో తెల్సునా? తన కిష్టమైన వాళ్ళ పేర్లు మాత్రం తీసి పేరు కింద పేరు, పేరు కింద పేరు - అట్లా ఒక కాయితంపైన రాసుకుంటాడు' అనినాడు.

ఏమయ్యా, అయ్యవారూ! ఆ లిస్టు ఎంత పొడుగుంటుందో నీకేమైనా తెలుసునా?'

చెప్పడానికేమి తోచక 'తెలుసుకుని చెబుతాన్లే' అన్నాను.

కానీ సాయిబు నాకా అవకాశం ఇవ్వలేదు. చెట్ల క్రింద బడికి దేవుడే సెలవు ప్రకటించినట్టుగా ఒకసారి వారం రోజుల పొడుగునా జడివానలు పట్టుకున్నాయి. వాన కొంచెం తెరపి ఇచ్చాక వెళ్ళి చూద్దుము గదా, అతడు స్మారకం లేకుండా నులక మంచంలో పడి ఉన్నాడు.

విషయం తెలియగానే అతడి రక్తబంధువులందరూ కట్టగట్టుకున్నట్టుగా వచ్చేశారు. మందూ మాకూ ఇప్పించినా లాభం లేకపోయింది. మూడు రోజులలాగే పడిఉన్న తరువాత, అద్దంనుంచీ నీడ జారుకున్నట్టుగా అతడి ప్రాణం బొందిని ఖాళీచేసి వెళ్ళిపోయింది.

సాయిబు నిష్క్రమణ తరువాత చిరకాలంగా వేధిస్తూ వచ్చిన రహస్యం ఒకటి విచ్చిపోయే సందర్భం వచ్చేసింది. అతడి కయిన వాళ్ళందరూ అవురావురుమంటూ గుడిసెనంతా గాలించేశారు. గునపాలతో ఇల్లంతా కుళ్ళగించేసేవారేమోగానీ, ఈలోగా పాత ట్రంకుపెట్టెలో లుంగీ గుడ్డల క్రింద ఓ ప్లాస్టిక్ కవరు కనిపించింది. బాణావరం స్టేట్‌బాంకుకు చెందిన ఫిక్సెడ్ డిపాజిట్ ధ్రువపత్రం అది. అది కంటపడగానే కొడుకుల ముఖాలు విప్పారిపోయాయి. కూతుళ్ళు మా వాటా సంగతేమిటన్నారు. మీ కిచ్చేదేమిటి; పో పొమ్మన్నారు అన్నదమ్ముళ్ళు. మా సంతకాలు లేకుండా మీరెలా డబ్బును చేజిక్కించుకుంటారో చూస్తాము లెమ్మని సవాలు విసిరారు అక్క చెల్లెళ్ళు.

ఈ వివాదం యిలా కొనసాగుతుండగానే ఒకరోజు స్టేట్‌బాంకు ఉద్యోగి ఒకతను బస్సులో వచ్చి దిగేశాడు. సాయిబుతో సంబంధమున్న వాళ్ళనందరినీ సమావేశపరచి అతడు బహిరంగ ప్రకటన కావించేశాడు.

"అయ్యలారా! అమ్మలారా! అందరూ శ్రద్ధగా వినండి. చనిపోయిన నెటాలం సాయిబు చాలా కాలంనుంచీ మా ఖాతాదారు. ముప్పై ఏళ్ళ క్రితం అతడు మా బాంకులో వేసిన మూడువేల రూపాయలు మళ్ళీ మళ్ళీ ఫిక్సెడ్ డిపాజిట్టు క్రిందికి మార్చుతూ రావడంవల్ల చనిపోయేనాటికి అతడి పేరట రూపాయలు ముప్పై ఏడు వేలా నాలుగు వందలా పజ్జెనిమిది మాత్రం దాఖలు పడింది. ఒక వ్యక్తి సంపాదన రూలు మేరకు అతడి వారసులకు చెల్లవలసిందే కాని ప్రస్తుత కేసు విషయంలో అలా జరగడానికి వీల్లేని పరిస్థితి ఎదురైంది. ఆరు నెలల క్రితం మా ఖాతాదారు ఇందును గురించి ఒక నిర్ణయం తీసుకుని లాయరు చేత వీలునామా రాయించి, మా బాంకు మేనేజరుగారికి ఇచ్చి వచ్చాడు. దానిమేరకు ఎఫ్.డి.కి సంబంధించిన మొత్తం చెల్లనూరు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందుతుంది. దీంతో వీలైనన్ని గదులు కట్టించాలన్నది అతడి కోరిక!"

తిట్టుకున్న వాళ్ళ మాట అటుంచి, తటస్థులైన వాళ్ళుకూడా 'మూర్ఖపు ముండాకొడుకు! హైస్కూలుకు తన పేరు పెట్టమనైనా రాసిపోయాడు కాదు' అనుకున్నారు.

అతడలా రాయించకపోవడం నా మట్టుకు నాకు మాత్రం ఆశ్చర్యం కలిగించలేదు. డెబ్బైయేళ్ళకు పైగా బ్రతుకు వెళ్ళదీసినందుకు సార్థకంగా ఏదైనా ఒక మంచి పని చేసి వెళ్ళాలన్నది బహుశా అతడి సంకల్పమై ఉంటుంది.

భగవంతుడనే ఆయన ఒకడుంటే గింటే, ఆయన పనిగట్టుకుని తనకు ప్రీతిపాత్రులైన వారి పేర్లతో ఒక లిస్టు తయారుచేయడమంటూ జరిగితే, అందులో అతడి పేరు తప్పకుండా ఉంటుందన్నది నా నమ్మకం.

మా హైస్కూలు యాజమాన్యం తరపునా, ఉపాధ్యాయుల బృందం తరపునా, బడి పిల్లల తరపునా నెటాలం సాయిబుకు నా సలాములు!

♦ *'ఆంధ్రప్రభ' వారపత్రిక - 1987* ♦